నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, మంగళవారం 14 జనవరి 2025 | MEDAK


# పంట రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసింది..

- మాజీమంత్రి హరీశ్‌రావుకు మొరపెట్టుకున్న గోవిందపూర్ రైతులు



మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు మొరపెట్టుకుంటున్న గోవింద్‌పూర్ రైతులు

జహీరాబాద్, జనవరి 13: రూ.2 లక్షలకు పైగా ఉన్న రైతులకు పంట రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు మొరపెట్టుకున్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో మోతీమాత జాతరకు వెళ్తున్న క్రమంలో గోవింద్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుతో పలువురు రైతులు మాట్లాడుతూ.. రూ. 2 లక్షలకు పైగా పంట రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. అందులో కొందరికి అసలే మాఫీ కాలేదన్నారు. రూ. 2 లక్షలకు పైన ఉన్న రుణాన్ని బ్యాంకులో చెల్లించాలని చెప్పడంతో డబ్బులు చెల్లించామన్నారు. ఇప్పటివరకు రూ. 2 లక్షలకు పైగా ఉన్న రైతుల రుణమాఫీ చేయకుండా నట్టేట ముంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ ఇట్లుంటే రైతు భరోసా కింద వానకాలం, యాసంగి సీజన్లకు ఆర్థిక సహాయాన్ని ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగిందన్నారు. రుణమాఫీ, రైతు భరోసాపై రైతుల పక్షాన ప్రభుత్వంతో పోరాడి న్యాయం చేసేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



సంగారెడ్డి పట్టణంలో ముగ్గులు వేస్తున్న యువతులు

# పల్లెల్లో సంక్రాంతి శోభ

## రంగవల్లులతో కళ కళ లాడుతున్న ఇండ్ల లోగిళ్లు

## నేడు సంక్రాంతి... రేపు కనుమ

పల్లెల్లో సంక్రాంతి కళ ఉట్టిపడుతుంది. ప్రతి ఇంటా సప్తవర్ణశోభితమైన రంగవల్లులు భోగి పండుగకు స్వాగతం పలికాయి. కోడి కూయకముందే గ్రామాల్లో భోగి మంటలు వెలిగించి ఆనందంగా గడిపారు. మహిళలు ఇండ్ల ఎదుట కల్లాప్లి చల్లి ముత్యాల ముగ్గులు వేసి రంగులద్దారు. రంగవల్లుల గొబ్బమ్మలు ఉంచి పుష్పాలతో అలంకరించారు. వారం రోజులుగా గంగిరెద్దులు గ్రామాల్లో సందడి చేస్తున్నాయి. పట్టణాలు, నగరాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, జనవరి 13



సోమవారం సిద్దిపేట పట్టణంలో భోగి మంటలు వేస్తున్న మహిళలు



సంగారెడ్డి పట్టణంలో పతంగులు ఎగురవేస్తున్న యువకులు

# ప్రజలందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట, జనవరి 13: ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరికీ మకర సంక్రాంతి సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సకల సంపదలతో సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ సంక్రాంతి ప్రతిఒక్కరి జీవితాల్లో నూతన కాంతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.. ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా, పసిడి పంటలతో పరిఢవిల్లాలని భగవంతుడిని వేడుకున్నానన్నారు. చిన్నారులు ఎగురవేసే పతంగుల పట్ల తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# మోతీమాత ఆశీస్సులతో మంచి జరగాలి

- బీఆర్‌ఎస్ హయాంలో మోతీమాత ఆలయం అభివృద్ధి
- గిరిజనులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం
- విదేశీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి
- మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలో మోతీమాత జాతరకు హాజరైన మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఘనంగా స్వాగతం పలికిన ఆలయ పుజారులు, కమిటీ సభ్యులు



మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలోని మోతీమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుంటున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



మోతీమాత అమ్మవారి దర్శనానికి నైవేద్యం, వస్త్రాలతో వస్తున్న తన్నీరు హరీశ్‌రావు

జహీరాబాద్/ఝరాసంగం, జనవరి 13: గిరిజనుల ఆరాధ్యదైవమైన మోతీమాత ఆశీస్సులతో అందరికి మంచి జరగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి తండాలో నిర్వహిస్తున్న మోతీమాత జాతరకు హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో పుజారులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. హరీశ్‌రావు ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, హారతి, యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోతీమాత జాతరలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన భక్తుల ఇలవేల్పుగా మారిన మోతీమాతను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తుంటారన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో ఆలయాభివృద్ధికి కృషి చేశామని, మోతీమాత జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం కమ్యూనిటీ హాల్, తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలను కల్పించామని చెప్పారు. ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఒక్క హామీని నేరవేర్చలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలోనే 10శాతం రిజర్వేషన్ కల్పించి విద్య, ఉద్యోగాల్లో అవకాశం కల్పించామని చెప్పారు. విదేశాల్లో చదువుకునేందుకు వెళ్లిన గిరిజన విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిపులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం సరికాదన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో చెల్లించిన మాదిరిగానే విద్యార్థులకు వెంటనే ఓవర్సీస్ స్కాలర్‌షిపులు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మహిళలకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం గిరిజనులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించేలా చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు మోతీమాత జాతరకు వచ్చిన మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ నరోత్తం, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్, మొగుడంపల్లి మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, నర్సింహులు, సంజీవ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, పార్టీ నాయకులు నామ రవికిరణ్, పెంటారెడ్డి, గుండప్ప, విజయ్‌కుమార్, హీరురాథోడ్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

# ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

- సంక్షేమ పథకాలు అందించడంలో విఫలం
- వ్యవసాయానికి ఇప్పటి నుంచే మొదలైన కరెంటు కష్టాలు
- ప్రభుత్వానికి ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం
- మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్



రాయపోల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకులు

రాయపోల్, జనవరి 13: ఆచరణకు మించి వాగ్దనాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ అన్నారు. సోమవారం రాయపోల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టి అరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం హామీలు నేరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పేదల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడలేని విధంగా కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే, రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించమని అడిగితే కేసులు, అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పేరుతో ఎన్నికలో ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో ఇప్పటికే తీవ్రమైన వ్యతిరేకత మొదలైందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలపై ప్రజలు నిలదీయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కేసీఆర్ పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాను చాటుకోవాలని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్ పిలుపునిచ్చారు. రైతులకు ఇప్పటి నుంచే కరెంట్ కష్టాలు ప్రారంభం కాగా యాసంగి సాగు కోసం కాల్వల ద్వారా సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాల్లో సాగునీటి వనరులకు కొరత లేదని, వాటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, మాజీ జడ్పీటీసీ యాదగిరి, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు రాజిరెడ్డి, మండల నాయకులు మురళీగౌడ్, జీవన్‌రెడ్డి ప్రకాశ్, మసంపల్లి రాజు, గౌరిగారి పరశురాములు, తిమ్మక్కపల్లి మాజీ సర్పంచ్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు

## బరితెగించిన కాంగ్రెస్ నాయకులు



అల్వాలలో పట్టా భూమిలో వేసిన రోడ్డును చూపుతున్న మాజీ వైస్ ఎంపీపీ రాజులు

- చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ రాజులు ఫిర్యాదు

మిరుదొడ్డి, జనవరి 13 : పట్టా భూమిలో అనుమతి లేకుండా అక్రమంగా రోడ్డు వేసిన కాంగ్రెస్ నాయకులపై అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు డిమాండు చేశారు. అల్వాల గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ రాజులుకు చెందిన 76, 77 సర్వే నెంబర్లలో 3 ఎకరాల పట్టా భూమి ఉండగా అందులో ఆదివారం రాత్రి కొందరు వ్యక్తులు మట్టి రోడ్డు వేశారు. సోమవారం వైస్ ఎంపీపీ గ్రామస్తులతో కలిసి రోడ్డును పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సత్యనారాయణ రెడ్డి, కనకయ్య కలిసి మట్టి రోడ్డు వేశారని ఆరోపించారు. తనను సంప్రదించకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తులు బరితెగించి దుశ్చర్యలకు పాల్పడడం సిగ్గు చేటని మండిపడ్డారు. అక్రమంగా రోడ్డు వేసిన కాంగ్రెస్ నాయకులపై కలెక్టర్, సీపీ, దుబ్బాక సీఐ, మిరుదొడ్డి తహసీల్దార్, మిరుదొడ్డి ఎస్సైలకు ఫిర్యాదు చేశానని రాజులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కలహాల కాంగ్రెస్..!

## సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్‌లో పొడచూపుతున్న విభేదాలు

- జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే మధ్య మనస్పర్థలు
- మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎవరికి వారే పట్టు
- పటాన్‌చెరులో గూడెం, కాటా మధ్య పెరిగిన పవర్ పాలిటిక్స్
- అధికారులకు పోస్టింగుల్లో గూడెందే పైచేయి
- అసంతృప్తితో గూడెంకు చెక్‌పెట్టేందుకు కాటా వ్యూహం
- స్థానిక ఎన్నికల్లో నష్టం తప్పదని క్యాడర్ ఆందోళన

సంగారెడ్డి, జనవరి 13(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో అధికార కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అటు ప్రభుత్వం, ఇటు కాంగ్రెస్ అధిష్టానానికి ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న అంతర్గత పోరు సవాలుగా మారుతున్నది. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలను ఎలా చక్కదిద్దాలో తెలియక కాంగ్రెస్ అధిష్టానం సతమతమవుతున్నట్లు తెలిసింది. జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేతకు, జిల్లా నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న నేతకు మధ్య విభేదాలు ముదురుతున్నాయి. ఇద్దరు నేతలు ఒకే వేదికను పంచుకోవడం లేదు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో సైతం కలిసికట్టుగా పాల్గొనడం లేదు. ఇద్దరు నేతల మధ్య దూరం పెరుగుతుండడం జిల్లాలో పార్టీకి నష్టం చేకూరుస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇద్దరు నేతల మధ్య విభేదాల కారణంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నష్టపోయే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు.

### మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం నువ్వానేనా?

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓ ఎంపీ, ఎమ్మెల్యే మధ్య కూడా విభేదాలు నెలకొన్నాయి. నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇద్దరు నేతల మధ్య మనస్పర్థలకు కారణంగా తెలుస్తున్నది. నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ ఎస్సీకి రిజర్వు అయ్యింది. ఈ పదవి తన అనుచరుడికి కట్టబెట్టాలని ఎంపీ పట్టుదలగా ఉన్నారు. అదే సమయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తన అనచరునికి ఇప్పించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే పావులు కదుపుతున్నారు. ఒకే పదవి కోసం ఇద్దరు ఎవరికి వారే పట్టుబడుతున్నారు.



తమ అనుచరులకు పదవి ఇప్పించేందుకు ఎంపీ, ఎమ్మెల్యే ఎవరికివారే తమ రాజకీయ పరపతిని వినియోగిస్తున్నారు. సీడీసీ చైర్మన్ పదవి ఎమ్మెల్యే వర్గం నేతలకు దక్కినందున, మార్కెట్ కమిటీ పదవి తన వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని ఎంపీ డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని జిల్లాకు చెందిన మంత్రి, కాంగ్రెస్ ముఖ్యనేతల దృష్టికి ఎంపీ తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. ఎమ్మెల్యే మాత్రం తన వర్గానికి చెందిన వ్యక్తికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. దీంతో ఇద్దరు నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎవరికివారే పావులు కదుపుతున్నట్లు తెలుస్తున్నది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పొందడం ద్వారా నియోజకవర్గంలో తమ పెత్తనం చాటుకోవాలని ఇద్దరు నేతలు పట్టుదలగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్ కమిటీ పదవి కోసం ఇద్దరు నేతల గొడవ పడుతుండడం పార్టీకి నష్టం కలిగిస్తుందని, ఇద్దరి మధ్య విభేదాలు ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

### పటాన్‌చెరులో 'పవర్' పాలిటిక్స్

పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల మధ్య పవర్ పాలిటిక్స్ జరుగుతున్నది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలైన కాటా శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గంలో పెత్తనం కోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్ పటాన్‌చెరు సెగ్మెంట్‌లో తాను చెప్పిందే జరగాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల వ్యవహారంలో పట్టుదలగా ఉన్నారు. కాటా శ్రీనివాస్‌గౌడ్ సూచించిన అధికారులకు ఎవరికీ ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇవ్వడం లేదు. దీంతో కాటా శ్రీనివాస్‌గౌడ్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ప్రభుత్వం, పార్టీ తీరును నిరసిస్తూ ఇటీవల తన మద్దతుదారులతో కలిసి పీసీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేయడంతో పాటు పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్కను కలిసి ఫిర్యాదు చేశారు. కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు తగిన ప్రాధాన్యత దక్కేలా చూస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. దీంతో కాటా తనకు న్యాయం జరుగుతుందని భావించారు. అయితే తాజాగా పటాన్‌చెరు నియోజకవర్గంలో అధికారుల పోస్టింగ్‌లలో మళ్లీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పైచేయి సాధించినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుకుంటున్నారు. కాటా శ్రీనివాస్‌గౌడ్ సూచించిన అధికారులకు కాకుండా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించిన అధికారులకు పోస్టింగ్‌లు దక్కినట్లు తెలుస్తున్నది. ముఖ్యంగా పోలీసు శాఖలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించిన అధికారులకు పోస్టింగ్‌లు దక్కడం కాటాకు మింగుడు పడడం లేదు. ఇటీవల అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల పోలీస్‌స్టేషన్లలో కాటా శ్రీనివాస్‌గౌడ్ సూచించిన అధికారులను కాకుండా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించిన అధికారులకు పోస్టింగ్‌లు లభించినట్లు సమాచారం. దీంతో కాటా శ్రీనివాస్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి మధ్య మరోసారి పవర్ పాలిటిక్స్ ఊపందుకున్నాయి. దీంతో ఇద్దరు నేతల మధ్య విభేదాలు మరింత పెరుగుతున్నాయని, ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని పటాన్‌చెరు కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి చెక్ పెట్టాలని కాటా శ్రీనివాస్‌గౌడ్ వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తుంది. దీనికోసం తనదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు ఆయన అనుచరులు చెప్పుకొస్తున్నారు.


